# దయ్యం

**అ**క్కడ దయ్యం ఉండేది. అందుకని ఆ ఇల్లు పాడుపెట్టారు. ఆ ఇంట్లో రాధ తల్లి చచ్చిపోయింది. రాధ తల్లి దయ్యమయిందని అందరికీ తెలుసును. కాని, అంత మహా ఇల్లాలును దయ్యమనటానికెవరికీ నోరు రాలేదు.

రాధకు దయ్యమంటే భయమే, ఆ ఇల్లంటేనూ భయమే. ఆ ఇంట్లో ఉన్న దయ్యం పొరుగింటి మహాలక్ష్మమ్మకు పట్టినప్పుడు మహాలక్ష్మమ్మను చూసి రాధ భయపడి, ఒక రోజల్లా కన్ను మూసి ఎరగదు.

కాని, ఆ ఇంట్లోనే ఉంది అమ్మ. "అమ్మేదే" అని తను యేడ్చినప్పుడు, "ఆ ఇంట్లో ఉందమ్మా" అని అమ్మమ్మ చెప్పలా? అయితే ఆ ఇంట్లోనే దయ్యం ఉంది కదా. అమ్మకు భయం కాదూ? అన్నట్టు అమ్మకు భయంలేదు. తనకు చీకట్లో పోవటానికి భయం వేస్తే అమ్మ తోడు వచ్చేది కాదూ?

రాధకు ఒక్కసారి అమ్మను చూడాలనిపించింది. ఎవరన్నా చూస్తే కోప్పడతారు. అందుకని రాధ ఒకనాడు, ఒక రాత్రివేళ అమ్మ ఉన్నయింటికి, దయ్యం ఉన్న ఇంటికి, బయలుదేరింది.

బిక్కుబిక్కుమనే ఆ ఇంట్లో అడుగు పెట్టినప్పుడు రాధకు భయం వెయ్యలేదు. "అమ్మా!" అని పిలిచింది.

జవాబు రాకపోవటం చూసి, "నువ్వు లోపల లేవుటే అమ్మా!" అన్నది రాధ అనుమానంతో.

"నాకోసం వచ్చావుటే. నా తల్లీ?" అన్నది రాధ.

"నీకోసం వచ్చానే!" అన్నది రాధ.

"నేను నీకోసం కని పెట్టుకున్నానే!" అన్నది రాధ.

"ఇన్ని రోజులు నాకు కనపళ్లేదేమే, అమ్మా?" అన్నది రాధ.

"నేను నీకోసం ఇక్కడే ఉన్నానే!" అన్నది రాధ.

"నేను నీ దగ్గర పడుకోవద్దుటే, అమ్మా?" అన్నది రాధ.

"నిన్ను నిద్రపుచ్చుతాను రావే, తల్లీ!" అన్నది రాధ. మర్నాడు రాధకోసం అందరూ

వెతికారు. ఆ దయ్యాల కొంపలో కటికనేల మీద, ఆ దుమ్ములో బోర్లా పడుకుని గాఢ నిద్రలో కనిపించింది రాధ.

రాధను లేపు వాళ్లవాళ్లు, అక్కణ్ణించి తీసుకపోయినారు.

"నేనమ్మ దగ్గిర పడుకున్నానే? నేనమ్మ దగ్గిరే ఉంటానే!" అని మూడేళ్ల రాధ పెనుగులాడింది.

"అయ్యో. ఇంకే మమ్మే! మీ అమ్మ చచ్చిపోయి దయ్యమయిందే!" అన్నారు రాధ బంధువులు.

రాధ అకారణంగా ఏడవటం మొదలుపెట్టింది. ఏం చేసినా ఆ ఏడుపు పోలేదు. అందర్నీ కొట్టడం మొదలుపెట్టింది. ఎవరో మల్లే మాట్లాడటం మొదలుపెట్టింది.

రాధకు దయ్యం పట్టిందన్నారు. వీభూది పెట్టించారు. ముగ్గులు వేయించారు. రాధ పోరు మానలేదు. తనకు చికిత్స చెయ్యటానికి వచ్చినవాళ్లమీదా తన తల్లిని దయ్యమన్న వాళ్ల మీదా రాధ నిప్పులు కక్కేదే. తీ పళ్లి పటపటా కొరికేది. ఏది దొరికితే అది వాళ్లమీద గిరాటు వేసేది.

వారంరోజుల్లో రాధ చిక్కి శల్యమయి మంచం పట్టింది. రాధ గొంతు వెలుగు రాజుకుపోయింది. హీనస్వరం పడ్డది. రాధ మంచినీళ్లు కూడా ముట్టటం మానేసింది.

మరో నాలుగురోజులకు రాధ అంతరించింది.

రాధను తల్లి దయ్యమైపట్టి తీసుకుపోయిందని అంతా అనుకున్నారు.

***ముద్రణ : కవిరాట్టు, అభూత కల్పనలు - గల్పికలు, 1942***

***యువ కార్యాలయం, తెనాలి***